


శ్రీ శ్రీవత్స

"ఏమండి - మన అబ్బాయి మీద్దయినా ప్రేమ పుడుతుందేమో మీ నాన్నగారికి!"

"పెరిగి పెద్దవాణ్ణయి కాస్త పేరూ గీరూ సంపాదించిన నామీద లేదుగాని - యీ ఏడాది పిల్లవాడిమీద ఆయన కిప్పుడు ప్రేమ కలుగుతుంది... ఆడవాళ్ల తెలివి తేట లిట్లాగే వుంటవి..."

"లేదండీ ..మనకు పెరుగుపోసే గొల్లదాన్ని - మనపిల్లవాడు ఎట్లావుంటూ వున్నదీ - విచారించినారుట."

"ఆఁ ఆ విచారణ లోకంకోసం... నామీద దయనుంచి అనుకొంటున్నావు కాబోలు."

"అదికాదండీ ..పిల్లవాడు ఎవరిపోలిక అని దాన్ని తరుచూ అడుగుతూ వుంటారుట."

"నీతల, పిల్లవాడు పుట్టగానే ఆయనకు వుత్తరము వ్రాసినాను... పోనీ జవాబు అయినా యివ్వకూడదూ."

"నాతో చెప్పలేదేమండి... నిజమో అబద్ధమో..."

"నీతో చెపితే ఏమి చేసేదానివి? అయినా తెలివి తక్కువ చేస్తున్నానని అనుకొంటూ పయిగా నీతో చెప్పడ మెందుకనిపించింది."

"నూరు వెయ్యిచెప్పండి లక్ష చెప్పండి... మన అబ్బాయిని ఆయన ఒక్కసారి చూస్తే ఆయనకోపమంతా పోతుందండీ..."

"ఏం ఎందువల్ల"

"ఇంత చక్కని పిల్లవాణ్ణి చూస్తే ఆయన మనస్సు కరగదుటండీ"

"అయితే తీసుకొని వెళ్ళి చూపించు"

"ఈ సాయంత్రము రైలుకు వెళుతాను. పిల్లవాణ్ణి చూపిస్తాను. ఆయనయెంత ఆదరంగా యెంత దయగా పిల్లవాణ్ణి ముద్దులాడి ప్రేమించేది మీరు వినకపోతారూ!"

"నీ తెలివితేటలు యిట్లా వున్నవి. అసలాయన నన్నెందుకు వదిలివేసేసినాడో తెలుసునా?"

"తెలుసు - తెలియకేం - నన్ను పెళ్లి చేసుకోవద్దంటే మీరు నన్ను చేసుకొన్నందుకే ననుకోండి. అయినా నామీద యెందుకుంటుంది కోపం? నా పిల్లవాడిమీద యెందుకుంటుంది కోపం?"

"ఏదో యింటర్మీడియేటు దాకా చదివినావు. మంచి తెలివితేట లుంటవనుకొన్నాను. అసలు మా నాన్న నాతో అప్పుడు చెపుతూనే వచ్చాడు - ఈ చదువుకొన్న ఆడవాళ్లకు అసలు మతివుండదని..."

"ఇప్పుడు మతిలేదని యెందు కనుకోవలసి వచ్చిందండి?"

"బాగుంది. నిన్ను పెళ్లిచేసుకొన్నందుకు - పెద్దదానివయిన నిన్ను పెళ్లిచేసుకొన్నందుకు తన శ్రోత్రియమంతా కృష్ణలో కలిసి పోతుందని, ఆయన కడుపున పుట్టినవాణ్ణి - నేను ఒక్కణ్ణితప్ప ఆయ కెవరూ యీలోకములో లేరే - అటువంటివాణ్ణి వదిలిపెడితే నీమీద ఆయనకు కోపము వుంటుందంటూ వేమిటి? చాదస్తము."

"అవునండి. ఆయనమాట వినలేదని వారికి మీమీద కోపం వుంటుంది. అది సహజమే! నామీద యెందుకుంటుంది కోపమాయనకు? ఆయనకు వ్యతిరేకం నేనేమి చేసినాను."

"భేష్! బాగుంది...యిక 'లా' కోర్సుకు నీవు తప్ప కూడా వెళ్లవలసిందే"

"సరే లెండి..యిదంతా యెందుకు ఒక్కసారి పోయి వస్తే తెలుస్తుందిగా!

"అవునులే పరాభవ మయితేగాని తిక్క వదలదు. తప్పకుండా పోయిరా"

"మీరుకూడా రండి?"

"నేనుమాత్రం అట్లాంటి తెలివి తక్కువపని చేయను."

ఇంతలో పిల్లవాడు పారాడుతూ - ఊఁ ఊఁ అంటూ వచ్చినాడు. రాఘవరావు దగ్గరకు తీసుకోబోయినాడు. పిల్లవాడు కిలకిల నవ్వుకొంటూ తల్లివైపు చూసినాడు. రాజమ్మ వెంటనే యెత్తుకొని ముద్దులాడుతూ "బాబూ నాన్న అంటే పడదుగాదూ నీకు" అన్నది.

పిల్లవాడు "ఊఁ ఊఁ" అని చంకలో యెగరడం మొదలు పెట్టాడు. రాజమ్మ పెనిమిటిని చూసి నవ్వింది. "అవును వాడు పుట్టినప్పటినుంచి అనుకొంటూనే వున్నాను. పోలికె అంతా నీది. తెలివితేటలు కూడా నీవే వస్తే..." అన్నాడు రాఘవరావు.

"హాయిగా - సుఖంగా కాలుమీద కాలువేసుకొని జమీందారులాగా బ్రతుకుతాడు నా తండ్రి" అన్నది రాజమ్మ.

రాఘవరావు ఒక్కనవ్వు నవ్వినాడు.

౨

రామయ్య కొమారుణ్ణి వదిలిపెట్టిన మూడు సంవత్సరాలనుంచి స్వగ్రామములో ఒంటరిగానే కాలక్షేపము చేస్తూవున్నాడు.

అరవై సంవత్సరాలు దాటిపోయినవి. నా అనేవాళ్లు యెవరూ లేరు. కొమారుడు పుట్టిన అయిదో యేటనే యిల్లాలు పోయింది. కావలసినంత ఆస్తి. ఆయనకు వచ్చే ఆదాయముతో పది కుటుంబాలు హాయిగా జీవనము చేయవచ్చును.

మధ్య వయస్సులో లేకపోయినా వృద్ధాప్యములో యేకాకి అయిపోయి నందువల్ల బాగా దానాలూ ధర్మాలూ చేస్తాడని వూళ్లో అంతా అనుకొన్నారు. చాలామంది బ్రాహ్మణోత్తము లాశ్రయించడము కూడా మొదలు పెట్టినారు. కాని అందరికీ ఆశాభంగము అయింది. అదివరకాయనకు వంటచేసి పెట్టడానికొక ముసలమ్మ వుంటూ వుండే. ఇప్పుడా ముసలమ్మను కూడా పనిలోనుంచి తొలగించినాడు. స్వయంగా వండుకొని తినడము మొదలుపెట్టినాడు.

కొడుకూ కోడలూ బాగా దారిద్ర్యము అనుభవిస్తున్నారని కూడా తెలుసును. పెళ్లి చేసుకొనే వరకూ కొడుకును తన పక్కలో పెట్టుకొని పడుకొనేవాడు. కాలేజికి పోయినంత సేపూ తప్ప యెన్నడూ ఒక్క క్షణ లేశమయినా రామయ్య కొడుకును వదిలిపెట్టి వుండలేదు. లోకానికి వాళ్లిద్దరూ అబ్బా కొడుకులకు మల్లె కనిపించలేదు. ఒక యువకుడికొక వయసు ముదిరిన స్నేహితుడు లాగా వుండేవాళ్లు. అటువంటి రామయ్య అంత మూర్ఖముగా కొడుకును వదిలిపెట్టినాడు.

'అంతా స్వార్జితము - ఒక్క చిల్లిగవ్వయినా యివ్వను -' అని శపథం చేసినాడు. అంత దయార్ద్రహృదయముతో అనాటివరకున్నూ వున్న తండ్రికి అంత కాఠిన్యమూ అంత క్రౌర్యమూ ఎట్లా వచ్చిందో రాఘవరావు యీ కిందటి మూడు సంవత్సరాలలోనూ వూహించలేక పోయినాడు.

రామయ్య అంత పట్టుదలతో అంత కఠినంగా, అంత క్రూరంగా వుంటాడని రాఘవరావుకు తోచినట్లయితే అసలు రాజమ్మను పెళ్లిచేసుకొనేవాడే కాడేమోనని అను కొన్నా అతిశయోక్తి కాదేమో! ఏమయితే నేమి అంతా అయిపోయింది. ఈ విషయంలో ఎవరు ఏమి జోక్యము కలిగించుకొన్నా, వాళ్ళను వుత్తపుణ్యానికి బూతులు తిట్టడములోకి వచ్చింది.

రాజమ్మ కడుపుతోటి వున్నదని తెలిసినప్పటినుంచి రామయ్య యెవరు కనుపించినా "అదెట్లాగూ బ్రదకదు లెండి - కాలేజీలో చదువుకొన్న దానికి కడుపువస్తే బ్రతుకు తుందిటయ్యా" అంటూ వుండేవాడు.

ఏమిటీ ముసలివాడికి పొయ్యేకాలము - శుభమా అని వంశవృద్ధి అవుతూవుంటే యిట్లాంటి మాటలంటాడు అని యువకులు అనుకొంటూ వుండేవాళ్లు - కాస్త ముసలి వాళ్లు మాత్రము - అదికాదు, కోడలుపోతే కొడుకుతో మళ్లీ చేరవలె ననుకొంటున్నాడు - అంటూ వుండేవాళ్లు.

కాని రాఘవరావుకు కొడుకు పుట్టినాడని తెలిసినప్పటి నుంచీ వూళ్లో వాళ్ళకు పెద్దలకూ చిన్నలకూ అందరికీ ఆశ్చర్యమే వేసింది. ఏమంటే ప్రతిరోజూ వుదయమే గొల్లపాలముపోయి తన కొడుకుకు పుట్టిన పిల్లవాడు ఆరోగ్యముగా వుంటూవుందీ లేందీ పెరుగుపోసేదాన్ని విచారిస్తూ వుండేవాడు.

అదివరలో పొద్దుపోక ఎవో వ్యవహారాలు ఎవరితో బడితే వాళ్ళతో రామయ్య మాట్లాడుతూ వుండేవాడు. ఇప్పుడా వ్యవహారమంతా కట్టిపెట్టినాడు. ఎవరితోనూ ఏమీ మాట్లాడడు. ఎవరయినా మాట్లాడితే చిర్రుబుర్రు మంటాడు. కరవవస్తాడు. పొడవవస్తాడు.

ఆజన్మపుణ్యకాలానా దమ్మిడి ఖర్చుపెట్టని రామయ్య యిల్లుతిప్పి కట్టించడము మొదలుపెట్టినాడు. మంచి విరుగుడు చావకర్రతో నగిషిపని చేయించి ఎంతో చక్కని ఉయ్యాలతొట్టె చేయించాడు. దక్షిణపు వైపున గది లోకి బాగా గాలివచ్చేట్టు కిటికీలు పెట్టించి ఒక ఉయ్యాల బల్ల చేయించి అమర్చినాడు. ఎవర్నీ తనయిల్లు చూడడానికి రానిచ్చేవాడు కాడు. ఈ యీ సామాన్లుఅన్ని చేయిస్తున్నా డని అధవా యెవరయినా తెలుసుకొని చూచిపోవడానికి వస్తే పట్టుకొని హీణ్ణి బండబూతులు తిట్టేవాడు.

## 3

చీకటి పడడడానికి యింకా ఒకగంట టయిము వుం టుంది. బందరుపోయే రైలుబండి అప్పుడే వచ్చింది. చంకను పిల్లవాడితో రాజమ్మ బండిదిగింది. అది కేవలం ఫ్లాగ్ స్టేషను తనపెట్టె మోయడానికి కూలీలు దొరకకపోయినందువల్ల ఎట్లాగో రైలుబండిలో నుంచి పెట్టె కిందికిలాగి స్టేషను మాష్టరుతో తాను వూళ్లోకి వెళ్లి మనిషి పంపుతాననీ అందాకా పెట్టె అక్కడే వుంచవలసిందని చెప్పి రాజమ్మ మామగారియిల్లు వెదుకుకొంటూ వూళ్లోకి బయలు దేరింది.

ఆయిల్లూ అదీ చూసేసరికి ఆమెకు ప్రాణము లేచి వచ్చింది. వెంటనే నవ్వు కూడా వచ్చింది.

ఊరంతా ఒకదారీ పులిపికట్టె ఒకదారీ అన్నట్టు వూరికి సంబంధములేకుండా బంగళా పంపినీగా వూరిబయట ఆ యిల్లువుంది. ఆమె వసారాలోకి వచ్చేసరికి రామయ్య లోపలనుంచి వచ్చినాడు.

సన్నగా పొడుగుగా - మెడలో ఒక మంగళసూత్రము తప్ప ముక్కులకు గానీ చెవులకుగానీ ఏ ఆభరణమూ లేకుండా ముఖానమాత్రము దమ్మిడీ వెడల్పున కళ్లుచెదిరిపోయే ఎర్రటి కుంకుమబొట్టుతో తెల్లచీరెతో కాళ్ళకు చెప్పు లతో అతి మనోహరముగానిసర్గ సౌందర్యముతో చంకనువున్న పిల్లవాడితో నిలుచున్నది. రాజమ్మను ఎగా దిగా చూస్తూ రామయ్య నిలుచున్నాడు. ఆమె స్వభావ ముతో తలవంచు కొన్నది.

గూండ్లకు చేరబోతున్న పిట్టలు కిలకిలలాడుతూ యెగిరి పోతున్నవి. ఎద్దులు సూర్యుడికి పృష్టభాగము చూపించి యింటికి మళ్లుతున్నవి. పనిఅయి యింటికి పోతున్న పడుచులు పాటలు పాడుకొంటూ వుత్సాహాతిశయ ముతో గంతులు వేస్తూ తూనీగలాగా యెగురుతూ రామయ్యయింటి యెదటి రస్తాను పోతున్నారు.

రామయ్య బంగళా యెదటవున్న మామిడిచెట్టుమీద కాకిగూట్లోనుంచి కాకిపిల్లలు బయటికివచ్చి తొంగిచూచి

పోతూవున్నవి. తల్లికాకి వచ్చింది. పిల్లకాకులు రెండూ తల్లికాకి రెక్కలకింద దూరి ముక్కులు పయికియెత్తి తల్లి వంక చూచినవి. తల్లి ఆ పిల్లల నోళ్ళలో యింత ఆహారము పెడుతూవుంది.

రామయ్య యిటు చూసేసరికి రాజమ్మ చంకనువున్న పిల్లవాడు చంకలోనుంచి దిగడానికి ఎంతో ప్రయత్నము చేస్తున్నాడు. పిల్లవాడి ప్రయత్నాన్ని సాగనియకుండా అట్లాగే చేత్తో నొక్కిపడుతున్నది. రాజమ్మ పిల్లవాడు పోరాడి పోరాడి యెదటవున్న వృద్ధ వ్యక్తినిచూచి కిలకిల నవ్వడము మొదలు పెట్టినాడు. రామయ్య అతి ప్రశాంతముగా ఆమెవంక చూస్తూ "ఏవరమ్మా నీవు - ఏవూరు మీది?" అన్నాడు. రాజమ్మ జవాబు యింకా నోట్లోనుంచి రానేలేదు, చంకను వున్న పిల్లవాడు ముసలివాడివంక చూసి చేతులు చాచి "తా... తా...త." అనడము మొదలు పెట్టినాడు.

రామయ్య ముఖములో కొంచెము ప్రసన్నత తోచింది. ఆమె జవాబు చెప్పక పూర్వమే "ఏవరమ్మా నీవూ యెందుకు వచ్చినావు" అన్నాడు రామయ్య. పసివాడు తదేకంగా "తా...త...త...తాత" అని మొదలు పెట్టి తాతకు చేతులందించి ఆమె చంకలోనిలవకుండా వున్నాడు. ఆమె మృదువుగా "వీడు నిలవనిచ్చేట్టు లేడు. చూడండి - ఎట్లా గింజుకొంటున్నాడో" అని పిల్లవాణ్ణి అందించింది. పిల్లవాడి ఆదుర్దాకు రామయ్య కూడా వున్ముఖుడయి తీసుకొన్నాడు. వెంటనే పసివాడు ఆయన ముఖాన్ని తవడడము సాగించి కండ్లుమూయడము మొదలు పెట్టినాడు,

మందహాసముతో "పిల్లవాడు మాంచి చురుకయిన వాడు లాగా వున్నాడు. ఇంతకూ నీవెవరో ఏమిటో చెప్పినావు కావు" అన్నాడు రామయ్య.

రాజమ్మకు ఎంతో ధయిర్యము వచ్చింది. ఆమె అతి మెల్లిగా..."వాడు మిమ్మలను సరిగానే పిలుస్తున్నాడు" అన్నది.

"అంటే - వాకర్థం కావడంలేదు" అంటూ కించి ద్రూక్షముగా ఆమెవంక చూసినాడు. ఆమె తలవంచు కొని వినయము వుట్టిపడుతూ 'తమ కుమరుడు...వాడు...' అన్నది.

"అంటే...ఏమిటీ?"

"తమ కొమారుడి కొమారుడు"

"అయితే నీవెవరు?"

"వాడి తల్లిని ..తమకోడలిని" అని తలవంచి ముసలి వాడి ముఖభంగిని చూస్తూవుంది. ఆయన పిల్లవాణ్ణి చూస్తూ ముద్దులాడుతూ ఆశ్చర్యపోతూ - "ఏమే అమ్మాయి యిట్లావచ్చావు - కారణమేమిటి?" అన్నాడు.

"ఏమీలేదు. పసివాడు నిద్రలోకూడా తాత తాత అంటాడు..."

"అంతేనా - ఇంకా ఏమన్నా"

రాజమ్మ ఏమీ మాట్లాడలేదు. అట్లాగే తలవంచుకొని నిలుచున్నది. రామయ్య చంకలోవున్న పసివాడు "తా... త...తా...త" అంటూ తల్లివంక చూడడము మొదలు పెట్టినాడు.

"ఏమే - నీపేరేమిటే అమ్మాయీ..."

"రాజ్యలక్ష్మి"

"రాజ్యం. నీవు పసివాడికి తాతయ్యను చూపిద్దామని తీసుకొని వచ్చావా లేక కొంపతీసి...నీవు యింత చక్కని పిల్లవాణ్ణి కన్నందుకు నిన్నుకూడా వాడు వెళ్ళి పొమ్మన్నాడా?"

ఆమె ఏమీ మాట్లాడలేదు. పిల్లవాణ్ణి చూస్తూ "ఏమిరా - బాబూ బుచ్చివాడా ..నాదగ్గర వుంటావటరా?" అన్నాడు. పసివాడు ఆ మాటలకు జవాబుగా రెండు చిన్న చేతులతోనూ ముసలివాడి కంఠం కౌగలించుకొన్నాడు...

"అమ్మాయి - వాడి సంగతి తెలిస్తే నీవు పెళ్ళిచేసుకొనే దానివే కాదు...సరే అదంతా యెందుకులే... బుచ్చివాడికి పేరేమి పెట్టినావు"

“ రామయ్యా......మీ అబ్బాయిగారు మాత్రము రామారావు అని పిలుస్తారు ”

“ అవును. నాకు తెలుసు. వాడికి ఆ వెధవకు రామయ్య అనడానికి నోరెట్లా వస్తుంది? - రాదు. అంటూ పిల్లవాణ్ణి యీ చంకలోనుంచి ఆచంకలోకి మార్చబోయి నాడు. పసివాడు ఆ మార్పుకు సంతోషిస్తూ బాల్య



చాపల్యముతో తాతను ముద్దుపెట్టుకొన్నాడు. ఆయన బ్రహ్మానంద పడిపోయినాడు. ఆయనా పిల్లవాణ్ణి ఒకటికి రెండుసార్లు ముద్దుపెట్టుకొన్నాడు.

“ ఏమే రాజ్యం...వీణ్ణి వాడిదగ్గిర వుంచితే చెడగొడ తాడు. వీడు వాడిలాంటి పనికి మాలినవాడయి పోతాడు. వాడిమొఖం, యిట్లాంటి బంగారంలాంటి పిల్లవాణ్ణి పెంచ డము వాడికేం తెలుసు ?...నీవూ చిన్నదానివి. నీకూ తెలియదు. ఇక్కడ నాదగ్గిర వుంచు. సరే చీకటి పడు తున్నది. లే, యిక వంటగింటూ సంగతి చూడాలో వద్దూ మరి” అన్నాడు.

రాజమ్మకు మితాశ్చర్యము కలిగింది. తాము రజస్వలా నంతర వివాహము చేసుకొన్నందుకు తన భర్తను తిట్టి గొట్టిన వాడు తనను యింత గౌరవించడమెందుకో అర్థము కాలేదు. పసివాణ్ణి తనకు తిరిగి యివ్వ లేదు. పిల్లవాణ్ణి చంకను వేసుకొని లోపలికి వెళ్లిన రామయ్య పంచాంగము చూస్తూ “ ఏమే అమ్మాయి డోలారోహణానికి యిప్పుడు మంచి ముహూర్తముకూడా వుంది. ఉయ్యాల యిదివరకే తయారు చేయించాను. ఉయ్యాల వేసి పిల్లవాణ్ణి పడుకోపెడదాము ” అంటూ తాళ్లూ తక్కరా చూడడము మొదలు పెట్టినాడు.

“ మామగారూ .. ..నేను మడి గట్టు కొంటాను. దేవతార్చనకు పనికి వస్తుందో రాదో...” అని సాలోచనముగా అన్నది.

“ఏం ఎందుకు పనికిరాదు...ఓహో నీవు రజస్వలయినతర్వాత కాదూ పెళ్లిచేసుకొన్నది ...అయితే మానెలే. ఇటువంటి పుత్రుణ్ణికన్న తర్వాత నీకాదోషమంతా పోయింది...అయి నా నీ మొఖము చూస్తే రజస్వల తర్వాత పెళ్లిచేసుకొన్నదానిలాగా కనిపించడము లేదు! ...త్వరగా కానియ్యి...పిల్లవాడు కళ్లుమూస్తు న్నాడు. వాడు నిద్రపోతే ఎట్లా మరి ?”.

‘సరే’ నని వంటచేయడానికి వెళ్లిపోయింది.

## ४

“ అయితే ప్రమాదమేనంటావా ఏమిటి ?...”

“ప్రమాద మేమిటండీ- సాయంత్రముదాకా వుంటారో వుండరో—”

“ అయితే నేను వెళిచూస్తే తిడతాడా - దీవిస్తాడా ?”

“ కొంచెంసేపువుండండి. ఆయన తెల్లవారాయిస్తున్నారు, మీకు టెలిగ్రాము యిప్పించినానని రాత్రే చెప్పినాను ”

"ఏమన్నాడు"

"ఏమీ అనకుండా ఊరుకొన్నారు"

"సరే అయితే పిల్లవాడేడి?..."

"వచ్చిన నెలరోజుల నుంచీ పిల్లవాడు ఆయన్ను వదలి పెట్టి వుండడము లేదు. ఆయనా పాపము వాణ్ణి చూడకుండా ఒక్కక్షణమైనా వుండలేకుండా వున్నారు."

"అయితే ఆజబ్బువంటి వాడి దగ్గర వుంచినావా పసివాణ్ణి..."

"అదేం అంటువ్యాధి కాదు. ఆయన దగ్గరనుంచి తీసుకొనివస్తే పసివాడు గుక్కబట్టి ఏడుస్తాడు. అంటూ రాజమ్మ పెనిమిటితో చెప్పతూవుండగా లోపలినుంచి - ఏమమ్మా రాజమ్మా - మళ్లీ కడుపులో నొప్పి తెరవచ్చింది... రావమ్మా - అంటూ కేకవచ్చింది. ఆమె లోపలికి వెళ్లింది.

ఎట్లాగూ పుత్రుడు! - రాఘవరావు అక్కడ ఒక్క క్షణము నిలుచోలేక పోయినాడు. లోపలికి వెళ్లినాడు. కడుపులో నొప్పితో రామయ్య కళ్లుమూసుకొని మూల్గుతున్నాడు. చుట్టూ వూళ్లో పెద్దలున్నారు. ఇంకో క్షణముకంటె ఆయనకు యీ లోకములో ఋణములేనట్టు అందరికీ తోస్తున్నది.

దీపము ఆరిపొయ్యేటప్పుడు ఒక్కసారి భగ్గున మండుతుందిట. అట్లాగే ఆ సమయానికి అతి తెలివివస్తుందంటారు పెద్దలు - ఒక్కసారి రామయ్య - తేరి పారచూచినాడు ఎదట రాఘవరావు కనిపించినాడు. కండ్లు ఉరిమిచూస్తూ "నామాట వినకుండా తోసివేసి నన్ను ధిక్కరించావు కదూ...నీకొక్క పూచిక పుల్లయినా యివ్వలేదు...కరణంగారూ వీడు తర్వాత పేచిపెడతాడు...ఆ విల్లు మీద వీడిసాక్షిసంతకం చేయించండి... చూస్తారేం? అన్నాడు రామయ్య.

అందరి ముఖాలమీద నవ్వు నాట్యమాడుతూ వుంది. కాని అది సమయము కానందువల్ల నవ్వుధ్వనిగా మాత్రము మారలేదు.

విల్లుమీద సాక్షి సంతకము రాఘవరావు చదివి చూడకుండానే చేసినాడు.

కరణంగారు మంచమువంక చూస్తూ "నారాయణ నారాయణ" అన్నారు.

పసివాడు తాత - తాత అని కెవ్వున కేక వేసి ఏడవసాగినాడు.

---


చాలాకాలపుది | మొదటిరకం | సాటిలేదు

బాద్షాహి

రోమ సంహారి సబ్బు

అందమయిన టిన్ను పెట్టెలో బిళ్లలు పెట్టి వున్నవి.

3 బిళ్లల పెట్టె కిమ్మతు ౧౨ అణాలు. ఖర్చులు ప్రత్యేకము

మంచి పరిమళము నిస్తుంది. ఎల్లప్పుడు దీన్ని వుపయోగించండి

సోలు ఏజంట్లు :—

**C. C. MAHAJAN & CO.,**
**281 Jumma Masjid, BOMBAY 2.**

మద్రాసు వర్తకులు :—

**జె. యం. సేట్**
260 చైనాబజారు రోడ్డు, మద్రాసు.